క్లుప్తంగా

ఘనంగా బసవేశ్వరస్వామి సంబరం

కపిలేశ్వరపురం: అంగరలో శనివారం బసవేశ్వరస్వామి సంబరం కర్షభక్త సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గత నెల ఫిబ్రవరి 26న ప్రారంభమైన సంబరాలు శనివారంతో ముగిశాయి. అద్దంపల్లికి చెందిన విజయదుర్గా వీరనాట్యం కళాకారులు నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. చేనేత కార్మికులు ఆరాధ్య దైవంగా కొలిచే స్వామికి అరటి గెలలను సమర్పించారు. గ్రామంతో పాటు పడమర ఖండ్రిక, నల్లూరు, నిడసనమెట్ట, నేలటూరు తదితర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

మాజీ సర్పంచ్ చొల్లంగి రాముడు కుటుంబానికి పరామర్శ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉట్రుమిల్లి గ్రామ మాజీ సర్పంచ్ చొల్లంగి రాముడు(85) ఈ నెల 24న మృతి చెందారు. ఆయన మృతికి సంతాపం తెలుపుతూ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, జిల్లా యూత్ వింగ్ అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. రాముడు కుమారులు శ్రీనివాస్, త్రిమూర్తులు, రామకృష్ణ, కుమార్తె కృష్ణవేణి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట సర్పంచ్ కట్టా గోవిందు, శెట్టిబలిజ సంఘ పెద్దలు నరాల ఏడుకొండలు, కట్టా సూర్యనారాయణ, పెంకే వీరరాఘవులు, గ్రామ పెద్దలు సూరంపూడి పుల్లయ్య, సూరంపూడి అప్పారావు, చొల్లంగి శ్రీను, సూరంపూడి వెంకటరమణ, సూరంపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ సభ్యుడు వీర్రాజు మృతి


చల్లా వీర్రాజు (ఫైల్)

కపిలేశ్వరపురం: నేలటూరుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చల్లా వీర్రాజు (75) శనివారం మృతి చెందారు. ఈయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. 1998లో నేలటూరు మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం నుంచి ఎంపీటీసీగా ప్రాతినిధ్యం వహించారు. ఈయనకు భార్య సత్తెమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం నాయకుడుగా చేనేత వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికై నియోజకవర్గ స్థాయిలో విశేష కృషి చేశారు. వీర్రాజు మృతి పట్ల ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టా అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ రుద్రాక్షుల వీర గోరీకు మారి, ఉప సర్పంచ్ శనక్కాయల దొరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లా వీరబాబు, వై వెంకన్నబాబు సంతాపం వ్యక్తం చేశారు.

శివారు భూములకు సాగునీరు అందించాలి


కాజులూరు: మండలంలోని బందనపూడి, గొల్లపాలెం శివారు చీకట్లవారిపేట, మొగలిపాలెం తదితర ప్రాంతాలలో సాగునీరందక పొలాలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. శనివారం పొలాల వద్ద రైతు సంఘం నాయకులు మోకన శ్రీనువాసు, సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ తమ పొలాలకు కోరంగి కెనాల్ నుంచి మతుకుమిల్లి మీదుగా సాగునీరు రావాల్సి ఉందన్నారు. ఎగువ ప్రాంత రైతులు పంట పొలాల్లో ఆయిల్ ఇంజిన్లు వేసి అనధికారికంగా నీరు తోడివేస్తుండటంతో కాలువ శివారు భూములకు చుక్కనీరు రావటం గగనమౌతుందన్నారు. సుమారు 200 ఎకరాలకు సాగునీరందక బీటలు వారుతున్నాయన్నారు.

సోమేశ్వర స్వామి హుండీల లెక్కింపు


స్వామివారి హుండీల ఆదాయం లెక్కిస్తున్న దేవస్థాన సిబ్బంది

కె.గంగవరం: మండల పరిధిలోని కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వర స్వామి ఆలయ హుండీలను శనివారం దేవదాయ ధర్మదాయ శాఖ రామచంద్రపురం తనిఖీదారు బాలాజీ రాంప్రసాద్ పర్యవేక్షణలో దేవస్థాన సిబ్బంది, అధికారులు, గ్రామస్తుల సమక్షంలో లెక్కించారు. మహా శివరాత్రి నేపథ్యంలో స్వామివారికి హుండీలు, అభిషేకాలు, టికెట్లు, విరాళాల ద్వారా మొత్తం రూ.11.17 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ భీమశంకరం తెలిపారు.

బాలికా సంరక్షణ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయవరం: బాలికా సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పలువురు పేర్కొన్నారు. రాయవరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భేటీ బచావో..భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ సూర్యనారాయణ, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వీఎస్ సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విష్ణు, సునీతలు మాట్లాడుతూ ప్రతి ఇంట ఆడపిల్ల జన్మించడాన్ని పండగలా భావించాలన్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. పోలీస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరంభమే.. అధరహో!

- వేసవికి ముందే ఠారెత్తిస్తున్న పుచ్చకాయల ధరలు
- చలువకు చలువ.. ఆరోగ్యానికి ఆరోగ్యం
- కొనుగోళ్లకు వినియోగదారుల ఆసక్తి


దాహార్తిని తీర్చే పుచ్చకాయలు


పుచ్చకాయ ముక్కలు

రాయవరం: మండుటెండలో ఓ పుచ్చకాయ ముక్క తింటే ఎంతో హాయిగా ఉంటుంది. చిన్నారుల నుంచి పెద్దవారి వరకు అందరికీ నోరూరించే పుచ్చకాయ అంటే ఇష్టపడని వారుండరు. అయితే వేసవి కాలం రాకుండానే పుచ్చకాయలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. గతంలో మార్చి ప్రారంభం నుంచి పుచ్చకాయల అమ్మకాయలు ప్రారంభమయ్యేవి. ఈ ఏడాది జనవరి మొదటి వారం నుంచే అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు ఎక్కడ చూసినా పుచ్చకాయలు అమ్మే షాపులు రోడ్డు పక్కన వెలుస్తున్నాయి.

పెరుగుతున్న విక్రయాలు

పండ్లు ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచించడంతో ఇటీవల కాలంలో పండ్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. వేసవి కాలంలో ఎక్కువగా వచ్చే పుచ్చకాయలకు అదే తరహాలో డిమాండ్ ఏర్పడుతోంది. పుచ్చకాయలో మెండుగా ఔషధ గుణాలు ఉండడంతో పాటు వేసవిలో దాహార్తిని తీరుస్తుంది. అయితే ప్రస్తుతం పుచ్చకాయ మాత్రం ప్రారంభంలోనే అధరహో అన్నట్లుగా ఉంది. ప్రస్తుతం చెన్నై, నెల్లూరు నుంచి పుచ్చకాయలను వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. టన్ను రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఉండడంతో కేజీ రూ.30 వరకు అమ్మకాలు చేస్తున్నారు. సైజును బట్టి ఒక్కో కాయ రూ.100 నుంచి రూ.250 వరకు ధర పలుకుతోంది. ధరలు బాగుండడం, పగటి వేళ ఎండ పెరగడంతో చిరు వ్యాపారులు రహదారి పక్కన స్టాల్స్ ఏర్పాటు చేసుకుని విక్రయాలు ప్రారంభించారు. చిన్న చిన్న ముక్కలుగా కోసి ఒక్కో ముక్క సైజును బట్టి రూ.10, రూ.20 వంతున వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. షుగర్‌బేబీ(మహారాష్ట్రలోని అమెరికా రకం), నాందారి(మన రాష్ట్రంలోని రకం), ఆర్క్‌మెన్ తదితర రకాలున్నా నాందారి, మధుబాల రకాలకే డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.

పోషక పదార్థాలెన్నో..

పుచ్చలో బి విటమిన్, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా లభిస్తాయి. పుచ్చకాయలో కొలెస్ట్రాల్ ఉండదు. వీటి వలన శక్తితో పాటు వంటికి మేలు చేయడం.. నిస్తేజమైన శరీరానికి కొత్త శక్తిని తేవడం వంటివి జరుగుతాయి. పుచ్చకాయలో 92 శాతం ఆల్కలైన్, నీళ్లతో పాటు పీచు పదార్థం ఉండటం వలన శరీరానికి, మూత్ర పిండాలకు, మూత్ర నాళాలకు ఎంతో ఉపయోగకరం. పుచ్చకాయ తినడం వలన మలబద్ధకం నివారణవుతుంది. ఇందులో ఉండే బీటాకెరోటిన్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వ సమస్యను నివారిస్తుంది. కిడ్నీలో రాళ్లు ఉన్నవారికి సైతం ఉపయోగకరం. ఆస్మా, మధుమేహం, ఆర్థరైటిస్ సమస్యలకు బాగా పని చేయడంతో పాటు సక్రమంగా రక్త ప్రసరణ జరిగేలా చేస్తుంది. అంతేకాకుండా పుచ్చకాయ సౌందర్యానికి కూడా ఉపకరిస్తుంది. 100 గ్రాముల పుచ్చకాయలో 91.45 గ్రాముల నీరు, ఆరు శాతం చక్కెర, 30 కేలరీల శక్తి, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 0.6 గ్రాముల మాంసకృత్తులు, పొటాషియం 12, కాల్షియం ఏడు, సోడియం ఒక మిల్లీ గ్రాము వంతున ఉంటుంది.

క్లస్టర్ పరిధిలో..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గంలోని మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటు మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో పలు చోట్ల పుచ్చకాయ షాపులు వెలిశాయి. రాయవరం, పసలపూడి, మాచవరం, మండపేట, ద్వారపూడి తదితర గ్రామాల్లో రహదారి పక్కన షాపులు ఏర్పాటు చేశారు. రహదారి వెంబడి ప్రయాణించే వారు షాపుల వద్ద ఆగి దాహార్తిని తీర్చుకోవడం కోసం పుచ్చకాయ ముక్కలు తీసుకుంటున్నారు. కొందరు పుచ్చకాయలను కొనుగోలు చేసి ఇంటికి తీసుకుని వెళ్తున్నారు.

ఘంటాంబికా అమ్మవారి సన్నిధిలో మాజీ మంత్రి విశ్వరూప్


అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి పినిపే విశ్వరూప్

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి దేవాలయానికి దక్షిణాన ఉన్న దక్షగుండం వద్ద ఘంటాంబికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా శివరాత్రి మహోత్సవంలో భాగంగా శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ప్రముఖ దాత సత్తి సుబ్బారెడ్డి, సీతారత్నం దంపతుల ఆధ్వర్యంలో వేలాది మందికి అన్న ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దడాల రవికుమార్, నాయకులు తోట బాబులు, అడివి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం


మోడరన్ జూనియర్ కళాశాల వద్ద పరీక్ష రాసేందుకు వచ్చిన ఇంటర్ విద్యార్థులు

రామచంద్రపురం: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని నాలుగు కళాశాలల్లో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్ ఇంటర్‌తో పాటు ఒకేషనల్ విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 354 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 40 మంది హాజరు కాలేదు. వికాస్ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో 290 మందికి గానూ 282 మంది హాజరయ్యారు. నారాయణ జూనియర్ కళాశాలలో 284 మందికి గానూ 5గురు పరీక్షకు రాలేదు. మోడరన్‌లో 362 మందికి గానూ 350 మంది, వీఎస్ఎం కళాశాలలో 432 మందికి గానూ 413 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం అయిదు పరీక్ష కేంద్రాల్లో 1,722 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 84 మంది హాజరు కాలేదు. తొలిరోజున జనరల్ ఇంటర్‌లో సంస్కృతం, తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషన్ జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్షను నిర్వహించారు.

రాయవరం: రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు తెలుగు, సంస్కృతం పరీక్షను రాశారు. రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్-2, రాయవరం విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఇక్కడ పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు చెందిన 75 మంది తెలుగు పరీక్ష రాయాల్సి ఉండగా, 70 మంది పరీక్ష రాశారు. ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. 184 మంది విద్యార్థులు సంస్కృతం పరీక్ష రాయాల్సి ఉండగా, 177 మంది హాజరు కాగా, ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షాకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డీవీవీ నాగేశ్వరరెడ్డి పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు.

కాజులూరు: కాజులూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షా కేంద్రంలో స్థానిక కళాశాల విద్యార్థులతో పాటు గొల్లపాలెం కాకతీయ కళాశాల, పిఏస్ఎన్ మూర్తి, కోలంక డీఆర్ కళాశాలకు చెందిన మొత్తం 559 మంది ఇంటర్ విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాస్తున్నారు. తొలిరోజు పరీక్షలలో భాగంగా 260 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 19 మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

కమిషనర్ రంగారావు


మహిళలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

మండపేట: పట్టణంలో పన్ను బకాయి దారులు మార్చి నెలాఖరులోగా పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల్లోని ఇళ్లు, ఖాళీ స్థలాల యజమానులు తమ పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నులు చెల్లించేందుకు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. స్వచ్ఛ మండపేట ఆశయ సాధనలో భాగంగా ఆయన శనివారం పలు వార్డుల్లో కమిషనర్ పర్యటించారు. మున్సిపల్ ఏఈలు ఆంజనేయులు, పవన్‌కుమార్, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, సచివాలయ, శానిటేషన్ సిబ్బందిని వెంట తీసుకుని 26వ వార్డులోని గాంధీనగర్, రైతుబజార్ ప్రాంతాల్లోని వీధుల్లో శుభ్రతపై అవగాహన కల్పించారు. ఆర్పీలు, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ అమరవీరుల దినోత్సవం


మండపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు


రాయవరంలో అమరులైన వారికి నివాళులర్పిస్తున్న ఎంఆర్పీఎస్ నేతలు

మండపేట: ఎమ్మార్పీఎస్ అమరవీరుల దినోత్సవాన్ని మండపేటలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు నాయకత్వంలో శనివారం మెయిన్‌రోడ్డులోని కృష్ణా టాకీస్ ఎదురుగా ఉన్న ఎమ్మార్పీఎస్ స్తూపం వద్ద అమరులైన వారికి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ దులపల్లి సుబ్బారావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, విశ్రాంత డీఈవో పెనుబాక షాలెంరాజు, ఉపాధ్యాయులు పలివెల లోవరాజు, గాలింకి నాగేశ్వరరావు, కొడమంచిలి భాస్కరరావు, గోశాల ప్రసాద్, మోరంపూడి సుబ్రహ్మణ్యం, మడికి ఆనందరావు, వీహెచ్‌పీఎస్, రెల్లి సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: ఎస్సీ వర్గీకరణకై ఉవ్వెత్తున సాగిన ఉద్యమంలో అశువులు బాసిన అమరవీరులను స్మరించుకునేందుకు ఆదివారం సంస్మరణ సభను నిర్వహించనున్నట్టు ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం తెలిపారు. కపిలేశ్వరపురంలో సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే సభలో మండలంలోని గ్రామాల నుంచి వర్గీకరణ ఉద్యమ నాయకులు హాజరవుతారన్నారు.

రాయవరం: మాదిగ వర్గీకరణ పోరులో ప్రాణాలర్పించిన అమరులకు రాయవరంలో ఎంఆర్పీఎస్ నేతలు శనివారం నివాళులర్పించారు. స్థానిక ఎంఆర్పీఎస్ నేత లంక చందు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పోరాటబాటలో అమరులైన నాయకులకు, కార్యకర్తలకు అమర్ రహే అంటూ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నేతలు ఎం.నాగేశ్వరరావు, సీహెచ్.చిన్నబ్బులు, సీహెచ్.సంజయ్‌రాజు, డి.చంద్రశేఖర్, సీహెచ్.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

రామచంద్రపురం: విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించి పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోటివేషన్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ నియోజవర్గంలో టెన్త్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విజేతలకు ల్యాప్‌టాప్‌లు బహుమతిగా అందజేస్తామని ప్రకటించారు. విద్యార్థుల విజయం కోరుతూ అయినవిల్లి వినాయకుడి గుడిలో పూజలు చేసిన పెన్నులు, స్టడీ మెటీరియల్‌ను మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం విద్యాశాఖ అధికారుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. డీవైఈవో రామ్‌లక్ష్మణ్ మూర్తి, ఎంఈఓ లు తాడి వీర రాఘవరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, నాయుడు మాస్టర్, రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు

మండపేట: పట్టణ పోలీస్ స్టేషన్లో విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. శనివారం సీఐ దారం సురేష్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న వివిధ తరగతుల విద్యార్థినులకు బీపీ, హార్ట్‌బీట్, బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ప్రైవేట్ డాక్టర్లు బిక్కిన తాతబ్బాయి చౌదరి, జోతిర్మయిలు వైద్య సేవలు అందించారు. 50 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించామని ఎస్ఐ శాస్త్రి తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చిన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలకు సర్వం సిద్ధం

- రెండు నియోజకవర్గాల్లో విశిష్టమైన మసీదులు
- ఉపవాసాలకు సన్నద్ధమైన ముస్లిం సోదరులు


అంగరలోని మసీదు


విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న జామియా మసీదు

కపిలేశ్వరపురం: నిత్యం ఒడిదొడుకులతో జీవితాన్ని ఈడ్చే ప్రజలు అల్లాహ్ కానుకల కోసం ఆశగా ఎదురు చూసే పండగ రంజాన్ . సకల శుభాలూ కలుగజేసే పవిత్ర రంజాన్ మాసం ఆదివారం నెలవంక దర్శనంతో ప్రారంభం కానుంది. మనసును ప్రక్షాళన చేసుకొని నెలవంకను చూసేందుకు ముస్లిం సోదరులు ఎదురు చూస్తారు. నెల రోజుల పాటు జరుపుకునే రంజాన్ వేడుకల్లో ప్రతి క్షణమూ ఆధ్యాత్మిక వికాసంతో జీవిస్తారు. ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకుంటూ రోజంతా ప్రణాళికాబద్ధంగా గడుపుతారు. అంతటి ప్రాశస్త్యంగల రంజాన్ పండగను జరుపుకునేందుకు మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని ముస్లిం సోదరులు సన్నద్ధమయ్యారు. ఆయా ప్రాంతాల్లోని మసీదుల్లో తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

రెండు నియోజకవర్గాల్లో నిర్వహణ ఇలా..

రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం, ద్రాక్షారామ, వెలంపాలెం, కె.గంగవరం, పామర్రు, చేదువాడ, కాజులూరు, మండపేట నియోజకవర్గంలోని మండపేట, ఏడిద, ద్వారపూడి, కేశవరం, అంగర, టేకి, కపిలేశ్వరపురం, రాయవరం, వెదురుపాక, లొల్ల, చెల్లూరు, పసలపూడి గ్రామాల్లోని మసీదుల్లో రంజాన్‌ను ఏటా ఘనంగా జరుపుకుంటారు.

మండపేటలో మసీదుల ముస్తాబు

మండపేట: ముస్లిం సోదరుల పండగలలో ఒకటైన రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం శనివారం సాయంత్రం రంజాన్ నెల ప్రారంభమైన నేపథ్యంలో ఆదివారం నుంచి ఉపవాస దీక్షలు మొదలు కానున్నాయని కలువపువ్వు సెంటర్‌లోని జామియా మసీద్ (పెద్ద మసీదు) గురువు హజరత్ మహమ్మద్ ముర్షిద్‌రజ్వీ తెలిపారు. శనివారం రాత్రి తరావీతో రంజాన్ మాసం ఆరంభమవుతుందని తెలిపారు. ఈ నెల రోజులు ముస్లింలకు అత్యంత పవిత్రమైన రోజులని పేర్కొన్నారు. మహిళలు ఉపవాస దీక్షలు ఆచరించి ఇళ్ల వద్ద ప్రార్థనలు జరిపితే పురుషులు మసీదుల్లో ప్రార్థనలు జరుపుతారని తెలిపారు. దయాగుణం, దానగుణం, క్షమాగుణం అలవర్చుకుని నెల రోజులూ వారివారి స్థాయికి తగ్గట్టుగా దానధర్మాలు చేస్తుంటారన్నారు. కాగా రంజాన్ ఆరంభాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కలువపువ్వు సెంటర్ జామియా మసీదు, గాంధీనగర్ చిన్న మసీదు, సైదిల్‌పేటలోని చిన్న మసీదులులు ముస్తాబయ్యాయి. అలాగే మండలంలోని ఏడిద, కేశవరం, ద్వారపూడి వస్త్ర మార్కెట్ రోడ్డులో ఉన్న మసీదులు సైతం సుందరంగా ముస్తాబయ్యాయి. రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణలతో మసీదులన్నీ కళకళలాడుతూ దర్శనమిచ్చాయి. శనివారం సాయంత్రం జామియా మసీదు వద్ద ముర్షిద్ రజ్వీ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం యువత, పెద్దలు పాల్గొన్నారు.

నియమబద్ధ జీవనానికి ప్రతీక



మానవుని నియమబద్ధ జీవనానికి ప్రతీకగా రంజాన్ నిలుస్తుంది. ప్రతి మనిషిలోనూ భావోద్వేగాలు సహజంగా ఉంటాయి. సామాజిక నియమాలను అలవర్చుకోవాల్సిన ప్రాధాన్యతను రంజాన్ స్పష్టంగా చెబుతుంది.

– షేక్ అహ్మద్ అలీషా, మండల కోఆప్షన్ సభ్యులు, ద్రాక్షారామ.

సద్గుణాలను అలవర్చుకునే మాసం



రంజాన్ మాసం ముస్లిం సోదరుల జీవితంలో అత్యంత పవిత్రమైనది. ఖురాన్ బోధనలను వినడం, పఠించడం రంజాన్ సమయాల్లో విధిగా పాటిస్తాం. ప్రపంచ శాంతికై ప్రతి మనిషి ముందుకు సాగాలని ఇస్లాం బోధిస్తుంది.

– మహ్మద్ అబ్బాస్ హుస్సేన్, ముతవలి, అంగర, కపిలేశ్వరపురం మండలం.